సాక్షి
నల్లగొండ
సోమవారం । 28 । ఆగస్టు । 2023



యాదాద్రికి పోటెత్తిన భక్తులు

యాదాద్రి నృసింహస్వామి దర్శనానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు.

- 10లో



మట్టపల్లిలో నిత్య కల్యాణం

మట్టపల్లి క్షేత్రంలో ఆదివారం శ్రీలక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

- 10లో



అదే నిజమైన సాహిత్యం

ప్రజల నాలుకలపై నిలిచి ఉండేదే నిజమైన సాహిత్యమని ప్రముఖ రచయిత సుద్దాల అశోక్ తేజ అన్నారు.

- 10లో

న్యూస్‌రీల్

సబ్ జూనియర్ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

నల్లగొండ టూటౌన్ : గజ్వేల్‌లో వచ్చే నెల ఒక టవ తేదీన జరుగనున్న సబ్ జూనియర్ బాలికల రాష్ట్ర ఫుట్‌బాల్ ప్రాబబుల్స్ కోచింగ్ క్యాంపునకు ఎనిమిది మంది బాలికలు ఎంపికైనట్లు ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొమ్మపాల గిరిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్యాంపులో మంచి ఆటతీరు ప్రదర్శించి రాష్ట్రస్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

కట్టంగూర్ : 18 సంవత్సరాలు నిండిన వారు తప్పకుండా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ సూచించారు. ఆదివారం కట్టంగూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో గల 192, 197 పోలింగ్ స్టేషన్లలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఓటు నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ఓటరు నమోదుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ స్వప్న, ఆర్ఐ కుమార్‌రెడ్డి ఉన్నారు.

29న మహాధర్నా

రామగిరి(నల్లగొండ) : ఈ నెల 29న ఇందిరాపార్కు వద్ద జరగనున్న కేజీబీవీ(కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం) సిబ్బంది మహాధర్నాను జయప్రదం చేయాలని ఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు బొంగరాల నర్సింహ, తెలంగాణ ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ జిల్లా నాయకురాలు సునిత కోరారు. ధర్నా పోస్టర్ ఆదివారం తిప్పర్తి, శెట్టిపాలెం కేజీబీవీలలో ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ కేజీబీవీలలో పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులతోపాటు కేజీబీవీ ఉద్యోగులకు కూడా ప్రభుత్వం పీఆర్‌సీ అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉమా, అలివేలు, వాణి, శైలజ, సుజాత, మహిబు, సాలమ్మ, కళ్యాణి, అనూష, లక్ష్మమ్మ, కృష్ణవేణి, మంగమ్మ, లక్ష్మి, ద్వాలి, సోనీ, సునిత, తదితరులు పాల్గొన్నారు.

చేనేత మహాసభలను జయప్రదం చేయాలి

రామగిరి(నల్లగొండ): సెప్టెంబర్ 4,5 తేదీల్లో నల్లగొండ జిల్లా కేంద్రంలో జరగనున్న తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర రెండో మహాసభలను జయప్రదం చేయాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంజి మురళీధర్ పిలుపునిచ్చారు. సభకు సంబంధించిన కరపత్రాన్ని ఆదివారం తిప్పర్తి మండల కేంద్రంలో ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కర్నాటి శ్రీరంగం, రావిరాల వెంకటేశ్వర్లు, రాపోలు అయోధ్య, రాపోలు జనార్దన్, రాపోలు గోవర్ధన్, రాపోలు పద్మ, రావిరాల ధనమ్మ, చెరువుపల్లి వెంకటయ్య, కుక్కల యాదగిరి, కొలను సత్యనారాయణ, కొలను శంకరయ్య, పొట్టబత్తుల పరమేష్, కొక్కుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

హాలియా: పట్టణంలో సెప్టెంబర్ 2, 3, 4వ తేదీల్లో నిర్వహించనున్న ఎస్ఎఫ్ఐ 44వ జిల్లా మహాసభలకు సంబంధించిన పోస్టర్‌లను ఆదివారం హాలియా పట్టణంలోని సుందరయ్య భవన్‌లో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్ ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రం ప్రభుత్వం దేశంలోని విశ్వవిద్యాయాల్లో అభ్యుదయ భావజాలంపై దాడులను ప్రోత్సహిస్తుందన్నారు. శాస్త్రీయ విద్యావిధాన్ని వక్రీకరిస్తూ విద్యార్థులకు ఒక్కటి పురాణాలు వల్లించి వారి మెదడులను మొద్దుబారిచే విధంగా చేస్తుందన్నారు. విద్యారంగంలో ఎదురవుతున్న సమస్యలు, సవాళ్లపై జిల్లా మహాసభల్లో చర్చించి భవిష్యత్‌లో చేపట్టబోయే పోరాటాల కార్యాచరణను రూపొందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు నల్లబెల్లి జగదీశ్, కోరే రమేష్, నవీన్, చందు, బ్రహ్మం, హరీష్, సాయి, పవన్, కల్యాణ్, లోకేష్ తదితరులు ఉన్నారు.

సబ్‌స్టేషన్లలోనే డ్యూటీ

- క్షేత్రస్థాయి విధుల్లో నరిపడాలేని సిబ్బంది
- ఉన్న కొద్దిమందిపై తప్పని పనిభారం
- సమస్యను పట్టించుకోని ఉన్నతాధికారులు



నల్లగొండ: విద్యుత్ శాఖలో కొందరు ఉద్యోగులు ఫీల్డ్ విధులకు ఎగనామం పెడుతున్నారు. క్షేత్రస్థాయిలో విధులకు వెళ్లాల్సి ఉన్నా అదేమీ పట్టించుకోకుండా అధికారులను మచ్చిక చేసుకొని రాజకీయ నాయకుల అండతో పైరవీలు చేసి సబ్‌స్టేషన్లలోనే డ్యూటీలు వేయించుకుంటున్నారు. దీంతో ఫీల్డ్ విధులు నిర్వహించే సిబ్బంది కొరత ఏర్పడింది. పైగా ఉన్న సిబ్బందిపై పనిభారం పెరిగి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

లైన్‌మెన్‌లపై పనిభారం

ఫీల్డ్ విధుల్లో ఒక్కో లైన్‌మెన్ 10 నుంచి 14 గ్రామాల బాధ్యతలు అప్పగిస్తుండడంతో వారిపై పనిభారం పెరిగింది. ఫీల్డ్ విధుల్లో ఉన్న సిబ్బంది ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం వచ్చినా, బ్రేక్‌డౌన్ అయినా వారే చూడాల్సిన పరిస్థితి. పైగా విద్యుత్ బిల్లులు నూటికి నూరు శాతం వారే వసూలు చేయాలి. చేయని వారికి అధికారులు మెమోలు ఇవ్వడంతోపాటు వేతనాలు కూడా కట్ చేస్తున్న పరిస్థితి. ఇలా చాలామంది సిబ్బంది ఫీల్డ్ విధులు నిర్వహిస్తూ ఇబ్బందులు పడుతున్నారు.

ప్రైవేట్ వ్యక్తులను నియమించుకొని..

అయితే సబ్‌స్టేషన్లలో చేయాల్సిన విధులు నెలలో 10 రోజులు మాత్రమే ఉంటాయి. అది కూడా కొందరు సిబ్బంది తమ బదులు ప్రైవేట్ వ్యక్తులను పెట్టుకొని వారితో డ్యూటీ చేయిస్తున్నారు. ఇలా చేయడం వల్ల ఓ ప్రైవేట్ ఉద్యోగి ఇటీవల ఒక ఫీడర్‌కు ఇవ్వాల్సి ఎల్‌సీ మరో ఫీడర్‌కు ఇవ్వడంతో జిల్లాలో ఒక ఉద్యోగి చనిపోయిన సంఘటన చోటు చేసుకుంది. అలాంటి వారిపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదని కొందరు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్షల రూపాయల్లో వేతనాలు తీసుకుంటూ సక్రమంగా డ్యూటీలు చేయకపోవడంపై సొంత శాఖలోనే కొందరు ఉద్యోగుల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం వచ్చినా, బ్రేక్‌డౌన్ అయినా వారే చూడాల్సిన పరిస్థితి. పైగా విద్యుత్ బిల్లులు నూటికి నూరు శాతం వారే వసూలు చేయాలి. చేయని వారికి అధికారులు మెమోలు ఇవ్వడంతోపాటు వేతనాలు కూడా కట్ చేస్తున్న పరిస్థితి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఫీల్డ్ విధులు నిర్వహించాల్సిన వారందరికి డ్యూటీలు వేసి తప్పకుండా విధులకు హాజరయ్యేలా చూడాలని మిగతా సిబ్బంది కోరుతున్నారు.

ఖాళీ పోస్టులు ఇలా..

జిల్లాలోని విద్యుత్ శాఖలో నల్లగొండ, మిర్యాలగూడ, దేవరకొండ డివిజన్లు ఉన్నాయి. వాటి పరిధిలో మొత్తం జూనియర్ లైన్‌మెన్లు 119, అసిస్టెంట్ లైన్‌మెన్లు 137, లైన్‌మెన్లు 14, లైన్ ఇన్‌స్పెక్టర్ 1, ఫోర్‌మెన్లు 4 ఖాళీలు ఉన్నాయి. ఈ పరిస్థితిలో ఫీల్డ్‌లో పనిచేయాల్సిన ఉద్యోగులకు డీఈలు సబ్‌స్టేషన్లలో డ్యూటీలు వేస్తున్నారు.

డివిజన్ల వారీగా విధుల్లో ఉన్న సిబ్బంది ..

మిర్యాలగూడ డివిజన్ పరిధిలోని లైన్‌మెన్లు 78 మంది ఉండగా 20 మంది సబ్‌స్టేషన్లలో పనిచేస్తున్నారు. కాగా, 31 మంది అసిస్టెంట్ లైన్‌మెన్లకు ఆరుగురు, 31 మంది జేఎల్ఎంలకు 14 మంది సబ్‌స్టేషన్లలో డ్యూటీలు చేస్తున్నారు. అంటే ఒక్క మిర్యాలగూడ డివిజన్‌లో ఫీల్డులో డ్యూటీ చేయాల్సిన వారు 40 మంది సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్నారు.

- నల్లగొండ డివిజన్ పరిధిలో ముగ్గురు లైన్‌మెన్లు, ఐదుగురు జేఎల్ఎంలు, ఫీల్డులో పనిచేయాల్సి వారు సబ్‌స్టేషన్లలో పనిచేస్తున్నారు.
- దేవరకొండలో 11 మంది లైన్‌మెన్లు, 2 అసిస్టెంట్ లైన్‌మెన్లు, ఆరుగురు జేఎల్ఎంలు, మొత్తం 19 మంది ఫీల్డులో కాకుండా సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు.

అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవాలి



ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్

- కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్
- నీలగిరి పట్టణంలో పలు పోలింగ్ బూత్‌ల పరిశీలన

నల్లగొండ : అర్హులైన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్ పేర్కొన్నారు. ఓటరు జాబితా సవరణ ప్రత్యేక ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆయన నల్లగొండ పట్టణంలోని డీఈఓ కార్యాలయంలో 61, 63 నంబర్ పోలింగ్ కేంద్రాలు, డైట్ కళాశాలలో ఏర్పాటు చేసిన 75, 76, 78, 81 పోలింగ్ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 26, 27 తేదీలతో పాటు వచ్చే నెల 2, 3 తేదీల్లో ప్రత్యేక ఓటర్ నమోదు ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓటరు జాబితాలో మార్పు చేర్పులను చేపట్టడం నిరంతర ప్రక్రియ అయినప్పటికీ, ఈ ప్రత్యేక ప్రచార రోజుల్లో అన్ని రకాల ఫామ్స్‌ను తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. అదేవిధంగా నల్లగొండ ఆర్డీఓ రవి నల్లగొండ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి ఓటు నమోదు ప్రక్రియను పరిశీలించారు. తిప్పర్తి, సర్వారం, దుప్పలపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

పాడి రైతులకు ప్రోత్సాహకం

- మదర్ డెయిరీ చైర్మన్ శ్రీకర్‌రెడ్డి



పాల ఫ్యాట్ టెస్టింగ్ మిషన్‌ను ప్రారంభిస్తున్న శ్రీకర్‌రెడ్డి

యాదగిరిగుట్ట రూరల్ : మదర్ డెయిరీతో పాడి రైతులకు ప్రోత్సాహకం లభిస్తుందని సంస్థ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి అన్నారు. యాదగిరిగుట్ట మండలంలోని బాహుపేట, మధిర గ్రామమైన కుమ్మరిగూడెంలోని పాల సంఘ భవనాల్లో నూతన ఆండ్రైజర్ మిషన్ల(పాల ఫ్యాట్ టెస్టింగ్ మిషన్)ను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎక్కడా లేని విధంగా మదర్ డెయిరీ లీటరు పాలకు 3 రూపాయలు ప్రోత్సాహకం అందజేస్తుందని, త్వరలో రూ.4కు పెంచనున్నట్లు తెలిపారు. అదే విధంగా మృతి చెందిన పాడి రైతులకు తక్షణ ఆర్థిక సాయం కింద రూ.15,000 అందజేస్తున్నట్లు చెప్పారు. తాను చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి తొలినాళ్లలో 39,000 లీటర్ల పాల సేకరణ జరుగుతుండగా ప్రస్తుతం 94,000 లీటర్లకు చేరిందన్నారు. పాల విక్రయాలు 40వేల లీటర్లు ఉండగా ఇప్పుడు 98వేలకు పెరిగాయన్నారు. ప్రభుత్వ విప్ గొంగిడి సునీత సహకారంతో ఆలేరు నియోజకవర్గంలో 15 ఫ్యాట్ టెస్టింగ్ యంత్రాలు, భవనాలు నిర్మించినట్లు వెల్లడించారు. ఒక్కో టెస్టింగ్ మిషన్‌కు రూ.1,80,000 వెచ్చించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రాంరెడ్డి, మదర్ డెయిరీ డైరెక్టర్ దొంతిరి సోమిరెడ్డి, మేనేజర్ కృష్ణ చైతన్య, బీసీ సెల్ మండల అధ్యక్షుడు కవిడె మహేందర్, పాల సంఘం చైర్మన్ పారెల్లి కృష్ణ, డైరెక్టర్లు మీనయ్య, భిక్షపతి, నర్సిరెడ్డి, మల్లయ్య, కృష్ణ, పెద్దులు, సత్యనారాయణ, చంద్రమౌళి, పంజాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.



కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద నిలిచిన వాహనాలు

హైవేపై వాహనాల రద్దీ

కేతేపల్లి : హైదరాబాద్- విజయవాడ 65వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం ఒక్కసారిగా వాహనాల రద్దీ పెరిగింది. ఆదివారం కావటంతో పాటు శుభకార్యాలు ఉండటంతో హైదరాబాద్ జంట నగరాల ప్రజానీకం వాహనాల్లో రాకపోకలు సాగించారు. దీంతో కేతేపల్లి మండలంలోని జాతీయ రహదారి వెంట గ్రామాల్లో జంక్షన్‌ల వద్ద రోడ్డు దాటేందుకు ప్రజలు నానా అవస్థలు పడాల్సి వచ్చింది. కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ ఏర్పడింది.

డీఈఓ ప్రకటనపై టీఎస్‌యూటీఎఫ్ ఖండన

నల్లగొండ : విద్యాశాఖలో ఎలాంటి మౌఖిక డిప్యూటేషన్లు లేవని అంతా సొంత పాఠశాలలకు వెళ్లి పని చేస్తున్నారని డీఈఓ ప్రకటించడాన్ని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎడ్ల సైదులు, పెరుమాళ్ల వెంకటేశం ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. జిల్లాలో 10 మంది ఉపాధ్యాయులు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతంలో ఎలాంటి ఉత్తర్వులు లేకుండానే మౌఖిక ఆదేశాల మేరకు పని చేస్తున్నారని పేర్కొన్నారు. డీఈఓ మౌఖిక ఆదేశాల ప్రకారమే పని చేస్తున్నారని ఎంఈఓలు తెలిపారని.. అయినా డీఈఓ తప్పుడు సమాచారం ఇవ్వడం సరికాదని తెలిపారు. ఇప్పటికైనా అక్రమ డిప్యూటేషన్లను రద్దు చేసి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అందరినీ వెనక్కు పంపాం

మౌఖిక డిప్యూటేషన్లకు సంబంధించి అందరినీ వెనక్కు పొమ్మని ఇప్పటికే చెప్పాం. వారంతా వెళ్లిపోయారు. వెళ్లనివారి వేతనాలు నిలిపివేశాం. ఎస్‌జీటీల విషయంలో ఎంఈఓలనే అవసరాన్ని బట్టి సర్దుబాటు చేసుకోవాలని మౌఖిక ఆదేశాలు ఇచ్చాం. వారిని కూడా వెనక్కి పొమ్మని చెప్పాం. ఇంకా ఎవరైనా ఉంటే పాత స్థానానికి వెళ్లాల్సి. లేదంటే చర్యలు తీసుకుంటాం.

– డీఈఓ భిక్షపతి

వృద్ధాప్యంలో మానసికంగా కుంగిపోవద్దు



జన్మదిన వేడుకల్లో పాల్గొన్న రిటైర్డ్ ఉద్యోగులు

కోదాడ రూరల్: రిటైర్‌మెంట్ తర్వాత ప్రశాంతమైన జీవితాన్ని గడపుదామని, ఎవరూ మానసికంగా కుంగిపోవద్దని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య అన్నారు. ఆదివారం కోదాడ పట్టణంలోని పెన్షనర్స్ భవన్‌లో ఆగస్టు నెల పుట్టిన పలువురి రిటైర్డ్ ఉద్యోగుల సామూహిక జన్మదిన వేడుక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారితో కేక్‌కట్ చేసి మాట్లాడారు. వృద్ధాప్యంలో మానసిక సమస్యలు దరి చేరకుండా ఆనందంగా గడిపేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ సందర్భంగా పుట్టిన రోజు జరుపుకున్న వారిని శాలువాలతో సన్మానించిన మెమెంటోలను అందజేశారు.

బోధనా సామర్థ్యాలు పెంచేలా..

- ప్రభుత్వ టీచర్లకు 'ఇన్నోవేషన్స్ రిపోసిటరీ' ఏర్పాటు
- వినూత్న ప్రక్రియకు శ్రీకారం చుట్టిన విద్యాశాఖ
- ఇందులో కొత్త ఆవిష్కరణలు నమోదు చేసుకునే అవకాశం
- నేడు ప్రారంభం కానున్న వెబ్ పోర్టల్



నల్లగొండ : ప్రభుత్వ ఉపాధ్యాయుల్లో బోధనా సామర్థ్యాలు పెంపొందించేందుకు విద్యాశాఖ నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. ఉపాధ్యాయులు సృజనాత్మకత, వినూత్నమైన ఆలోచనలకు పదును పెట్టి విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించేలా టీచర్ ఇన్నోవేషన్స్ రిపోసిటరీ పేరిట ప్రత్యేక వెబ్‌సైట్‌ను రూపొందించింది. ఇప్పటికే విద్యాబోధనను సరళతరం చేస్తూ.. ఉపాధ్యాయుల మధ్యపోటీ పెంచేందుకు టీచర్స్ లెర్నింగ్ మెటీరియల్ (టీఎల్ఎం) కార్యక్రమాన్ని విద్యాశాఖ అమలు చేస్తోంది. కొత్తగా తీసుకొస్తున్న పోర్టల్ ద్వారా పాఠశాలల్లో పిల్లలకు బోధన ప్రక్రియ ఆసక్తికరంగా మారనుంది. ఉపాధ్యాయులు కూడా ఈ కొత్త పోర్టల్‌ను ఉపయోగించుకొని మంచి ఫలితాలు సాధించవచ్చని విద్యాశాఖ భావిస్తోంది.

విషయ పరిజ్ఞాన వేదికగా వెబ్‌సైట్..

కొత్తగా తీసుకొచ్చిన ఇన్నోవేషన్స్ వెబ్‌సైట్ విద్యాశాఖలో విషయ పరిజ్ఞాన వేదికగా మారనుంది. ఈ వెబ్‌సైట్‌ను తెలంగాణ ఇన్నోవేషన్ సెల్, పాఠశాల జీయాల్ సంస్థలు సంయుక్తంగా నిర్వహించనున్నాయి. తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమాల్లో రూపొందించిన వినూత్న బోధన భావనలు, అంశాలను వ్యాఖ్యాంశాల వారీగా ఉపాధ్యాయులు వెబ్‌సైట్‌లో నిక్షిప్తం చేసేలా వీలు కల్పించారు. 1 నుంచి 10వ తరగతి వరకు పాఠ్యాంశాల వారీగా బోధన పద్ధతులను రూపొందించనున్నారు.

వెబ్‌సైట్‌లోకి ఉత్తమ అంశాలు..

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు రూపొందించనున్న అంశాల్లో ఎంపికైన ఉత్తమ వీడియో, యానివేషన్, ఆడియో అంశాలను ఉన్నతాధికారులు ఎంపిక చేసి వెబ్‌సైట్‌లో పొందుపర్చనున్నారు. ఆ వెబ్‌సైట్‌ను ఎవరైనా తిలకించేలా సరళతరంగా చేయనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పలువురు ఉపాధ్యాయులు రూపొందించిన ఉత్తమ అంశాలను వెబ్‌సైట్ నుంచి ఎవరైనా డౌన్‌లోడ్ చేసుకొని విద్యార్థులకు బోధించే అవకాశాన్ని కల్పించనున్నారు. డిజిటల్ పద్ధతిపై విద్యార్థులకు అవగాహన పెంపొందేలా ఇంటరాక్టివ్ ఫ్లాట్ ఫ్యానల్ టీవీ బోర్డులను అందుబాటులో ఉంచారు. అయితే కొత్తగా రూపొందించిన ఈ పోర్టల్‌ను సోమవారం (28వ తేదీన) ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించేందుకు విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది.

సద్వినియోగం చేసుకోవాలి

విద్యాశాఖ నూతనంగా ప్రవేశపెట్టి అమలు చేయనున్న టీచర్ ఇన్నోవేషన్ రిపోసిటరీ పోర్టల్‌ను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలి. అన్ని సబ్జెక్టుల్లో ఆవిష్కరించనున్న బోధన అభ్యసన ప్రక్రియలను ఉపాధ్యాయులు తెలుగు, ఇంగ్లిష్ మీడియంలలో పోర్టల్‌లో నమోదు చేసుకోవచ్చు.

– వనం లక్ష్మీపతి, సైన్స్ జిల్లా అధికారి, నల్లగొండ

వట్టిపోయిన పెద్దవాగు

- వాగు వెంట వందల ఎకరాల్లో పంటల సాగు
- నీరు లేకపోవడంతో ఆందోళనలో రైతులు
- చెరువులు నింపాలని డిమాండ్



పెద్దవూర సమీపంలో ఎండిపోయిన పెద్దవాగు

పెద్దవూర: నిత్యం నీటితో కళకళలాడే పెద్దవూర పెద్ద వాగు ఎండిపోయింది. గడిచిన 15 ఏళ్లలో పెద్దవాగు ఎండిపోయిన దాఖలాలు లేవు. కానీ ఈఏడాది ఆగస్టులోనే ఎండిపోయి రైతులను ఇబ్బందులకు గురి చేస్తోంది. ఈ సంవత్సరం తీవ్ర వర్షాభావ పరిస్థితులతో భూములు పూర్తిగా తడిసి నీరు బయటకు వెళ్లిన పాపాన పోలేదు. వాగులు, వంకలు పారే సరైన వర్షం ఇప్పటివరకు పడలేదు. దీంతో చెరువులు ఎండిపోయాయి. భూగర్భ జలాలు అడుగంటాయి. వర్షాలు పడినా విత్తనాలు వేసుకోవడానికి కావాల్సిన పదును మాత్రమే అయ్యింది. ఈ నేపథ్యంలో పెద్దవాగు ఆధారంగా సాగు చేపట్టిన రైతులు ఆందోళన చెందుతున్నారు.

వందల ఎకరాల్లో సాగు

పెద్దవూర మండలం గుండా ప్రవహించే పెద్దవాగు నాంపల్లి మండలం పసునూరు చెరువు వద్ద పుట్టి గుర్రంపోడ్, పీఏపల్లి మండలాల మీదుగా పెద్దవూర మండలంలోనికి ప్రవహిస్తుంది. ఏఎమ్మార్పీ ప్రాజెక్టు నిర్మాణం కాకముందు వర్షాకాలంలోనే ఈ వాగులో నీరు ప్రవహించేది. ప్రాజెక్టు నిర్మాణంతో కాలువల ద్వారా ఎప్పటికప్పుడు చెరువులను నింపుతుండడం, జంటనగరాలకు కృష్ణా జలాలలను అందించే వాటర్ ప్లాంటును పదిహేను రోజులకొకసారి శుభ్రం చేస్తుండడంతో ఈ వాగులో నిత్యం నీళ్లు ప్రవహిస్తుంటాయి.


వాగు నుంచి పైప్‌లైన్లు..

వాగు సమీపంలో భూములు ఉన్న రైతులు వాగులో విద్యుత్ మోటార్లు వేసుకుని పైపులైన్‌లు తీసుకుని పంటలు, తోటలు సాగుచేసుకుంటున్నారు. పెద్దవూర, ఈదులగూడెం, పిన్నవూర, బట్టుగూడెం, కొత్తగూడెం, తెప్పలమడుగు, లింగంపల్లి, పెద్దగూడెం, చిన్నగూడెం గ్రామాలకు చెందిన రైతులు వాగు వెంట వరినాట్లు వేశారు. వాగును నమ్ముకుని వాగుకు రెండు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న భూములకు పైపులైన్లు వేసుకుని బత్తాయి తోటలు, పత్తి, మిరప పంటలను సాగు చేస్తున్నారు. వర్షాలు సరిగా పడకపోవడంతో బత్తాయి తోటలు, పత్తి, మిరప చేలకు నీటి అవసరం రాగా, ఒక్కసారిగా వరినాట్లు వేయడంతో విద్యుత్ మోటార్లు అన్నింటిని ఒకేసారి ఆన్ చేయడంతో వాగులో నీరు ఇంకిపోతోంది. పై నుంచి నీరు రాకపోవడంతో రైతులంతా దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. పెద్దవాగు ఎండిపోవడంతో వాగును నమ్ముకుని సాగు చేసుకుంటున్న రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి ఏఎమ్మార్పీ నుంచి కాలువలకు నీటిని విడుదల చేసి చెరువులను నింపి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

వాగును నమ్ముకుని సాగుచేస్తున్నాం



వాగులో నిత్యం నీళ్లు వస్తుండడంతో రూ.8 లక్షలు ఖర్చు చేసి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న వ్యవసాయ పొలానికి పైపులైన్లు వేసుకున్నాను. ఇప్పటికే పదిహేను ఎకరాల్లో పత్తి, ఇరవై ఎకరాల్లో మిరప పంటలను వేశాను. ఇప్పటివరకు సరైన వర్షం పడకపోవడంతో ఈ సంవత్సరం వాగులో సక్రమంగా కూడా నీళ్లు పారలేదు. చెరువులు సైతం ఎండిపోయాయి. దీంతో వాగుకు సరైన ప్రవాహం లేదు. వాటర్ ప్లాంటును శుభ్రం చేయగా వచ్చే వృథానీరు పదిహేను రోజులకు ఒకసారి వస్తాయి. ఈ నీటితోనే ఇన్ని రోజులు నెట్టుకొస్తున్నాం. రూ.లక్షల పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటలు ఎండిపోయే పరిస్థితి దాపురించింది. – కూన్‌రెడ్డి వెంకటరెడ్డి, రైతు బట్టుగూడెం



వాగులో తేలిన మోటార్లు

క్లుప్తంగా

తిప్పర్తిలో చిరుత కలకలం



వ్యవసాయ భూమిలో చిరుత అడుగుల గుర్తులు

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి గ్రామ పంచాయతీ పరిధిలోని నూకలవారిగూడెంలో ఆదివారం చిరుతవిగా భావిస్తున్న అడుగులు కలకం రేపాయి. నూకలవారిగూడేనికి చెందిన సైదులు తిప్పర్తి శివారులోని వ్యవసాయ భూమి వద్దకు వెళ్లి చూసే సరికి చిరుత అడుగులు కనిపించాయి. వెంటనే చుట్టూ పక్కల ఉన్న రైతులకు సమాచారం తెలియజేశాడు. దీంతో అందరూ గమనించి చిరుత అడుగులే అన్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. ఫారెస్టు సెక్షన్ అధికారి గట్టుపల్లి మల్లారెడ్డిని సంప్రదించగా సమాచారం రాలేదని తెలిపారు.

నేడు గుట్టలో ఆత్మీయ సమ్మేళనం

యాదగిరిగుట్ట : బీఆర్ఎస్ పార్టీ ఆలేరు నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనం యాదగిరిగుట్ట పట్టణ పరిధి కొత్తగుండ్లపల్లిలో గల శ్రీలక్ష్మీనరసింహస్వామి గార్డెన్‌లో సోమవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు కర్రె వెంకటయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి సమ్మేళనానికి విచ్చేయనున్నట్లు వెల్లడించారు. అదే విధంగా ఆలేరు ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత తొలిసారిగా యాదగిరిగుట్టకు వస్తున్న ఆమెకు వడాయిగూడెం చౌరస్తా వద్ద పార్టీ కార్యకర్తలు స్వాగతం పలకనున్నారని పేర్కొన్నారు. అక్కడి నుంచి యాదగిరిగుట్ట పట్టణానికి ర్యాలీగా వెళ్లి వైకుంఠ ద్వారం వద్ద కొబ్బరికాయలు కొట్టి పూజలు చేస్తారని వివరించారు.

'అదనపు మైనింగ్‌కు అనుమతులు ఇవ్వొద్దు'

హుజూర్‌నగర్ : మైహోం సిమెంట్ పరిశ్రమకు అదనపు మైనింగ్‌కు అధికారులు అనుమతులు ఇవ్వవద్దు అని హైకోర్టు అడ్వకేట్ డాక్టర్ కృష్ణ నాయక్ భూక్యా అన్నారు. ఆదివారం హుజూర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వాతావరణ సమతుల్యతను దెబ్బతీస్తూ ఈప్రాంత ప్రజల ఆరోగ్యాలను చెడగొడుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో ఓయూ జేఏసీ నాయకులు ఎస్ సుమన్, ఆర్ కొడయ్య, నియోజకవర్గ గిరిజన సంఘ నాయకులు ఎం నగేష్, చిన్నబాబు, రవి నాయక్, బాలూ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

కనగల్: ఓ యువతి అదృశ్యమైంది. ఈ ఘటన కనగల్ మండల పరిధిలోని శాబ్దుల్లాపురంలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శాబ్దుల్లాపురం గ్రామానికి చెందిన దండు శ్రీను కుమార్తె నవ్య ఈ నెల 25న ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. బంధువులు, తెలిసిన వారి ఇంట్లో ఆరా తీసిన ఆచూకీ లభించలేదు. కుటంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అంతిరెడ్డి పేర్కొన్నారు.

50 ఆవులు పట్టివేత

కొండమల్లేపల్లి : హైదరాబాద్‌లోని కబేళాకు తరలిస్తున్న 50 ఆవులను పోలీసులు పట్టుకున్నారు. కొండమల్లేపల్లిలో ఆదివారం నిర్వహించే పశువుల సంత నుంచి గోవులను హైదరాబాద్‌కు తరలిస్తున్నారన్న బీజేపీ నాయకుల సమాచారం మేరకు పోలీసులు 50 ఆవులున్న ఒక కంటైనర్, రెండు డీసీఎంలను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వీరారెడ్డి తెలిపారు.

వృత్తిదారులకు పెద్దపీట కేసీఆర్ ఘనతే

- మంత్రి జగదీష్‌రెడ్డి

సూర్యాపేట: వృత్తిదారులకు పెద్దపీట వేసి అండగా నిలుస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కు మాత్రమే దక్కుతుందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ మోడ్రన్ మార్కెట్లో నిర్వహించిన జూకి కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గతంలో శాంతిభద్రతలు ఎలా ఉండేవో ప్రజలకు తెలుసని, ఇప్పుడు ఎవరి పనులు వాళ్లు ప్రశాంతంగా చేసుకుంటూ సంతోషంగా బ్రతుకుతున్నారన్నారు. ఓటే మన రాతను నిర్ణయిస్తుందని, ఇది ఎప్పటికీ ప్రజలు గుర్తుంచుకోవాలని మంత్రి పేర్కొన్నారు. ఇప్పుడున్న నవయుగంలో కొత్త కొత్త డిజైన్లతో అందంగా అందరూ కనిపిస్తున్నారంటే టైలర్ వృత్తిదారుల కృషి ఫలితమేనన్నారు. జూకి మిషన్ల వల్ల టైలర్లకు శారీరక శ్రమ తగ్గుతుందని, అందుకే వీటిని అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీ బడుగు లింగయ్య యాదవ్, మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ, గ్రంథాలయ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, ఆర్డీవో వీర బ్రహ్మచారి, మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్టా కిషోర్, బీసీ సంక్షేమ అధికారి అనసూయ, వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీనివాస్. ప్రజా ప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి జగదీష్‌రెడ్డి

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న యాదాద్రి ఏసీపీ శివరామ్ రెడ్డి, సీఐ సురేందర్ రెడ్డి

యాదగిరిగుట్ట రూరల్: చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. యాదాద్రి ఏసీపీ శివరామ్ రెడ్డి, యాదగిరిగుట్ట రూరల్ సీఐ సురేందర్ రెడ్డి ఆదివారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాచకొండ కమిషనరేట్ సీపీ ఆదేశాల మేరకు రాజపేట మండలం పాముకుంట ఎక్స్ రోడ్ వద్ద ఉదయం ఐదు గంటల ప్రాంతంలో పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై అనుమానాస్పదంగా వెళ్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా జనగాం జిల్లా బచ్చన్నపేట మండలం కొన్నె గ్రామానికి చెందిన యేట రమేష్ అంటీకరించాడు. అతడిని తనికీ చేయగా 10 తులాల బంగారం, ఒక కేజీ వెండి, టీవీఎస్ ఎక్సల్ ద్విచక్ర వాహనం, మొబైల్ ఫోన్ లభ్యమైంది. ఇట్టి ఆభరణాలను నిందితుడు రమేష్ రాచకొండ కమిషనరేట్‌లో ఉన్న గుండాల, బేగంపేట, కొమరవెల్లి, మద్దూర్, దేవస్థానం పరిధిలో ఆరు దొంగతనాలు చేసారని, దూదివెంకటాపురం, రఘునాథపురం, బొందుగుల, కుర్రారం గ్రామాల్లో రాత్రి సమయంలో ఇంట్లో ఎవరూ లేనప్పుడు, నాలుగు దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నాడని తెలిపారు. దీంతో పాటుగా నిందితుడు బచ్చన్నపేటలో పంక్చర్ షాప్‌లో పనిచేస్తూ జీవనం సాగించేవాడని, ఇంతకు ముందే 2010 నుండి2020 వరకు సిద్దిపేట,వరంగల్, రాచకొండ కమీషనరేట్ పరిధిలో 19 దొంగతనం కేసులు నమోదు అయ్యాయని, జైలుకు కూడా వెళ్లి వచ్చాడని తెలిపారు. జైలు జీవితం తర్వాత ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడి, మళ్లీ దొంగతనాలు చేస్తున్నాడని, 13 నేరాలు చేసాడని వెల్లడించారు. ఈ మేరకు కేసును నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. నిందితుడిని పట్టుకున్న ఎస్ఐ సుధాకర్, గుండాల హెచ్ సీ. రవికుమార్, తుర్కపల్లి హెచ్‌సీ. శ్రీనివాస్, పీసీఎస్. సద్దాం, దేవేందర్ మారుతీ, గోవింద్, ప్రేమ్‌కుమార్, సంధ్య,లకు ప్రత్యేక అభినందనలు ఏసీపీ తెలియజేశారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

అడవిదేవులపల్లి : పురుగుల మందుతాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన అడవిదేవులపల్లి మండలంలోని జిలకరకుంటతండాలో చోటు చేసుకుంది. దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామానికి చెందిన కోడావత్ స్వామితో అడవిదేవులపల్లి మండలం జిలకరకుంటతండాకు చెందిన లక్ష్మితో 14 ఏళ్ల క్రితం వివాహం అయింది. ఐదేళ్ల క్రితం స్వామి తన అత్త ఊరు అయిన జిలకరకుంట తండాలో భార్యతో కలిసి నివాసం ఉంటున్నాడు. వృత్తిరీత్యా ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కొంత కాలంగా భార్యభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో మనస్తాపానికి గురైన స్వామి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి పడిపోయాడు. అతడి కుమారుడు గుర్తించి తన మేనమామకు సమాచారం అందించాడు. స్వామిని మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి తండ్రి జాను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరిబాబు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. స్వామి కుటుంబాన్ని డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రిలో పరామర్శించారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

మోతె: గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. మోతె ఎస్ఐ వెంకటేశ్వర్లు తన పోలీసు సిబ్బందితో ఆదివారం సాయంత్రం మండలంలోని మామిళ్లగూడెం సింగరేని పల్లి టోల్ ప్లాజా వద్దకు చేరుకొని వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమానస్పదంగా కనిపించారు. వారిని పట్టుకొని తనిఖీ చేయగా 6 కేజీల గంజాయి లభ్యమైంది. వారిలో ఒకరు ఒడిశా రాష్ట్రానికి చెందిన బాలసర్ బంజారస్ కాగా మరొకరు బిహార్ రాష్ట్రానికి చెందిన సంతోష్‌యాదవ్‌గా పోలీసులు గుర్తించారు. నిందితులను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తాళం వేసిన ఇళ్లలో చోరీ

కోదాడరూరల్ : గుర్తుతెలియని వ్యక్తులు తాళం వేసిన రెండు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన కోదాడ పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణంలోని శ్రీనివాసథియేటర్ ఎదురువీధిలో నివాసం ఉండే లక్ష్మీ ఎలక్ట్రికల్స్ యజమాని బెల్లంకొండ రఘు కూతురు వివాహం ఉండటంతో అనంతగిరి మండలం త్రిపురవరంలో ఉన్న వ్యవసాభూమి వద్ద ఉన్న ఉప్పలమ్మవద్ద మొక్కులు చెల్లించుకునేందుకు ఆదివారం తెల్లవారుజామున 3గంటలకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. తన బామ్మరిది ఉదయం 5గంటలకు ఫంక్షన్‌కు హాజయ్యేందుకు ఇంటికి రాగా తాళం పగులకొట్టి తలుపులు తీసి ఉన్నాయి. విషయాన్ని అతను వెంటనే బావ రఘుకు సమాచారం ఇవ్వగా వచ్చి చూసే వరకు బీరువాలో ఉన్న రూ.9.50లక్షల నగదును దుండగులు అపహరించుక పోయినట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలాన్ని ఎస్పీ రాజేంద్రప్రసాద్, డీఎస్పీ ప్రకాష్‌లు సబ్బందితో కలిసి పరిశీలించారు.

కృష్ణప్రియ థియేటర్ వెనుకవీధిలో...

పట్టణంలోని కృష్ణప్రియ వెనక విధిలో విద్యుత్‌శాఖలో పనిచేసే భాస్కర్‌రావు నివాసం ఉంటున్నాడు. పది రోజుల కిందట ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్లారు. ఆదివారం పనిమనిషి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉంది. విషయాన్ని యజమానికి చెప్పడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇంటిలో ఉన్న రెండు తులాల బంగారు పుస్తెల తాడు, రూ.10వేల నగదు పోయినట్లు గుర్తించారు.

బ్లాస్టింగ్ చేస్తున్న వ్యక్తులపై కేసు

బొమ్మలరామారం : బ్లాస్టింగ్ చేస్తున్న వ్యక్తులపై ఆదివారం బొమ్మలరామారం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. బొమ్మలరామారం మండలంలోని తిమ్మాపూర్ శివారులో శనివారం అక్రమంగా బ్లాస్టింగ్‌లు చేస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి తన సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. మోత్కూరు మండలానికి చెందిన ఓర్సు తిరుపతి, రూపని తిరుపతిలను అదుపులోకి తీసుకున్నారు. వీరు, రవి, కొమరయ్య ఆధ్వర్యంలో బ్లాస్టింగ్‌లు చేస్తున్నట్లుగా తెలిసిందని, సదరు వ్యక్తులపై ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బీఆర్ఎస్, బీజేపీ రెండూ తోడు దొంగలే



పల్లె నిద్రలో మాట్లాడుతున్న బీర్ల అయిలయ్య

బొమ్మలరామారం : బీఆర్ఎస్ బీజేపి రెండూ తోడు దొంగలేనని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బీర్ల అయిలయ్య అన్నారు. మండలంలోని తిమ్మాపూర్‌లో ఎస్సీ కాలనీలో ఆదివారం రాత్రి నిర్వహించిన పల్లె నిద్ర కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ఏక కాలంలో రుణమాఫీ చేయకుండా, దళితులకు దళిత బంధు, పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు, ఇవ్వకుండా బీసీ బంధు, గృహలక్ష్మి, మైనార్టీబంధులాంటి పథకాలతో ప్రజలను మభ్యపెడుతున్నాడని విమర్శించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పిట్టల దొర మాటలతో మరోసారి ప్రజలను మోస పూరిత హామీలతో మరోసారి ప్రజల వద్దకు వస్తున్నాడన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మల్లేష్, మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు దనవాత్ సునీత, నాయకులు మోకు మధు సూధన్ రెడ్డి, ఎంపీటీసీలు హేమంత్ రెడ్డి, తిరుమల కవితా వెంకటేష్ గౌడ్,ఈదమ్మ , ఆగం రెడ్డి, యావపూర్ రాజు నాయక్, నాశమైన వెంకటేష్, శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి శ్రీకాంత్, నందు గౌడ్, మోహన్ నాయక్, నర్సింహ్మా నాయక్, బల్‌రామ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు అప్‌గ్రేడ్

- 37 కేంద్రాల స్థాయి పెంపు
- సిబ్బందికి పెరగనున్న వేతనం
- రెండు,మూడు రోజుల్లో వెలువడనున్న ఉత్తర్వులు



మినీ అంగన్‌వాడీ కేంద్రంలో బోధన చేస్తున్న టీచర్

భువనగిరిటౌన్ : జిల్లాలోని 37 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు అప్‌గ్రేడ్ కానున్నాయి. దాంతో పాటు ఆయా కేంద్రాల్లో పని చేస్తున్న టీచర్ల విద్యార్హతను బట్టి ఉద్యోగోన్నతి పొందనున్నారు. వేతనం రూ.7,800 నుంచి రూ.13,650కు పెరగనున్నది.

తొలగనున్న ఇబ్బందులు

మినీ అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో తక్కువ కుటుంబాలు ఉండడం, సెంటర్లు రెవెన్యూ గ్రామాలకు దూరంగా ఉండడంతో లబ్ధిదారులకు పౌష్టికాహారం అందించడం సిబ్బందికి కష్టంగా మారింది.సాధారణంగా ఒక మినీ అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో ఆయా, టీచర్ బాధ్యతలు ఒక్కరే నిర్వర్తించాలి. దీంతో కేంద్రాల పరిధిలో కుటుంబాల సంఖ్య పెరుగుతూ వస్తున్న కొద్దీ టీచర్లకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మినీ అంగన్‌వాడీ కేంద్రాల స్థాయి పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో సమస్యలు తీరనున్నాయి. లబ్ధిదారులకు మెరుగైన సేవలు అందనున్నాయి.

టీచర్లు, హెల్పర్లకు శుభవార్త

అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు ప్రభుత్వం శుభవార్త వినిపించింది. వీరి ఉద్యోగ విరమణ వయస్సు 65 ఏళ్లకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఉద్యోగ విరమణ తర్వాత టీచరుకు రూ.లక్ష., ఆయాకు రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం ప్రభుత్వం అందించనుంది. జిల్లా పరిధిలో భువనగిరి, ఆలేరు, రామన్నపేట, మోత్కూర్ ఐసీడీఎస్ సర్కిళ్ల పరిధిలో 844 ప్రధాన కేంద్రాలు, 57 మినీ కేంద్రాలు ఉన్నాయి. ఆయా సెంటర్లలో పని చేస్తున్న టీచర్లు, హెల్పర్లందరికీ ఉద్యోగ విరమణ వయస్సు వర్తించనుంది. అధికారులు వారి నుంచి వయస్సు, ధ్రువీకరణ పత్రాలను కూడా స్వీకరించారు. ప్రభుత్వం నుంచి రెండు, మూడు రోజుల్లో ఉత్తర్వులు వెలువడనున్నాయి.

ఉత్తర్వులు రావాలి


మినీ అంగన్‌వాడీ కేంద్రాల అప్‌గ్రేడ్‌కు సంబంధించి ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రావాలి. 37 మినీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేయాలని గతంలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. తమ ప్రతిపాదనల మేరకు అప్‌గ్రేడ్ చేస్తుందా 57 మినీ కేంద్రాల స్థాయి పెంచుతుందా ఉత్తర్వులు వస్తే తెలుస్తుంది.

–అన్నపూర్ణ,
ఇంచార్జ్ జిల్లా సంక్షేమ అధికారిణి

ఆకర్ష్‌కు పదును!

దూకుడు పెంచిన బీఆర్ఎస్ అభ్యర్థులు

- మూడోసారి గెలుపే లక్ష్యంగా ముందుకు
- బీజేపీ, కాంగ్రెస్‌లే టార్గెట్
- ద్వితీయ శ్రేణి నాయకత్వంపై ఫోకస్



సాక్షి, యాదాద్రి : జిల్లాలో ఎన్నికల వాతావరణం హీటెక్కుతోంది. అన్ని పార్టీలు ఎన్నికల మూడ్‌లోకి వెళ్లిపోయాయి. ముందుగానే అభ్యర్థులను ప్రకటించిన బీఆర్ఎస్.. ఈసారి కూడా గెలిచి హ్యాట్రిక్ కొట్టాలనే లక్ష్యంతో ముందుకెళ్తోంది. అందులో భాగంగా ఆపరేషన్ ఆకర్ష్‌కు మరింత పదును పెట్టే యోచనలో ఉంది. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల్లో ప్రభావం చూపగలిగే పలువురు నేతలను ఇప్పటికే గుర్తించినట్లు తెలుస్తోంది. వారిని త్వరలోనే తమ పార్టీలోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఇలా చేయడం ద్వారా రెండు పార్టీలను దెబ్బకొట్టి సులువుగా విజయం సాధించాలన్నది ఆ పార్టీ వ్యూహంగా కనిపిస్తోంది.

ద్వితీయ శ్రేణిపై దృష్టి

భువనగిరి నియోజకవర్గ పరిధిలో భువనగిరి, బీబీనగర్, వలిగొండ, భూదాన్‌పోచంపల్లి మండలాలు ఉన్నాయి. వీటితో పాటు భువనగిరి, భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీలు ఉన్నాయి. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కూడా ఆయా మండలాలు, పట్టణాల్లో పటిష్టంగా ఉండడంతో దెబ్బకొట్టేందుకు అధికార బీఆర్ఎస్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ప్రధానంగా ఆ రెండు పార్టీల్లోని ద్వితీయశ్రేణి నాయకత్వంపై దృష్టి సారించింది. స్థానిక ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, ముఖ్య నాయకులు, కుల సంఘాల పెద్దలు, మైనార్టీ నేతలతో చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది.

భువనగిరి మున్సిపాలిటీపై స్పెషల్ ఫోకస్

భువనగిరి మున్సిపాలిటీపై బీఆర్ఎస్ నాయకత్వం స్పెషల్ ఫోకస్ పెట్టింది. ఇక్కడ కాంగ్రెస్, బీజేపీలు బలంగా ఉన్నాయి. గత మున్సిపల్ ఎన్నికల్లో గణనీయమైన సీట్లు సాధించడంతో బీఆర్ఎస్ క్రాస్ ఓటింగ్‌పై ఆధారపడి మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. మున్సిపాలిటీ పరిధిలో సుమారు 35వేల ఓట్లు ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఆశించినస్థాయిలో ఓట్లు దక్కకపోవడంతో బలం పెంచుకునేయత్నంలో అధికార పార్టీ ఉంది. ఇందులో భాగంగా కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్లు, మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న ఆశావహులపై ఫోకస్ పెట్టింది. తమ పార్టీలోకి రప్పించేందుకు చర్చలు జరుపుతున్నారని, భవిష్యత్‌పై హామీలు ఇస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో కాంగ్రెస్, బీజేపీలకు చెందిన పలువురు కౌన్సిలర్లు, ద్వితీయ శ్రేణి నాయకులు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్‌లో చేరబోతున్నారని ఆ పార్టీ నాయకుడొకరు చెబుతున్నారు.

ఆలేరులో కొనసాగుతున్న చేరికలు

ఆలేరు నియోజకవర్గంలోనూ కొంతకాలంగా బీఆర్ఎస్‌లోకి వలసలు కొనసాగుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి కాంగ్రెస్, బీజేపీలోని అసంతృప్తులు, ద్వితీయ శ్రేణి నాయకులతో చర్చలు జరుపుతూ వారిని పార్టీలోకి తీసుకువచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. అదే విధంగా తుంగతుర్తి, నకిరేకల్, మునుగోడు నియోజకవర్గాల్లో ఇతర పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరుతున్నారు.

కుంభం రాకతో ఊపందుకున్న చేరికలు

డీసీసీ అధ్యక్షుడిగా ఉన్న కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి చేరికతో బీఆర్ఎస్‌లో చేరికలు ఊపందుకున్నాయి. తన అనచరులతో పాటు ద్వితీయ శ్రేణి నాయకులు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్‌లో చేరుతున్నారు. ఇంకా కాంగ్రెస్‌లోనే కొనసాగుతున్న తన అనచరులను కూడా బీఆర్ఎస్‌లోకి రప్పించేందుకు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి వారితో నేరుగా చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. వారంతా సానుకూలత వ్యక్తం చేశారని, రానున్న రోజుల్లో బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు ఉంటాయని ఆ పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది.

భవిష్యత్‌పై హామీలు

బీఆర్ఎస్‌లో చేరుతున్న ద్వితీయ శ్రేణి నాయకులకు భవిష్యత్‌పై హామీలు ఇస్తున్నట్లు తెలుస్తోంది. మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన ప్రాధాన్యం ఇస్తామని, అభివృద్ధికి పెద్ద మొత్తంలో నిధులు కేటాయిస్తామని హామీ ఇస్తున్నారని సమాచారం.

ఎయిమ్స్‌ను సందర్శించిన కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యే



పార్టీ నాయకులతో కలిసి మాస్టర్ ప్లాన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

బీబీనగర్ : బీబీనగర్ ఎయిమ్స్ వైద్య కళాశాలను కర్ణాటకలోని గడగ్ జిల్లా శిరహట్టి నియోజకవర్గానికి చెందిన బీజేపీ ఎమ్మెల్యే చంద్రు లమాని ఆదివారం సందర్శించారు. ఇన్‌పేషెంట్ విభాగాన్ని సందర్శించి అందుతున్న రోగులకు అందజేస్తున్న వైద్యసేవలపై ఆరా తీశారు. మెడికల్ కళాశాల నిర్వహణ గురించి తెలుసుకున్నారు. అలాగే మాస్టర్‌ప్లాన్‌ను పరిశీలించారు. అనంతరం ఎయిమ్స్ ప్రాంగణంలో కొనసాగుతున్న భవన నిర్మాణాలను పరిశీలించారు. ఆయన వెంట ఎయిమ్స్ ఇంచార్జి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నీరజ్‌అగర్వాల్, డాక్టర్ అభిషేక్ అరోరా, శ్యామల తదితరులు ఉన్నారు.

చిరు ధాన్యాల పంటలపై అవగాహన



యువకులకు అవగాహన కల్పిస్తున్న పీస్ సంస్థ డైరెక్టర్ నిమ్మయ్య

యాదగిరిగుట్ట రూరల్ : చిరుధాన్యాల అంతర్జాతీయ సంవత్సరాన్ని పురస్కరించుకొని ఆదివారం యాదగిరిగుట్ట మండలంలోని చొల్లేరులో చిరు ధాన్యాల సాగు, సస్యరక్షణ చర్యలపై పీస్ సంస్థ ఆధ్వర్యంలో యువతకు అవగాహన కల్పించారు. అంతరించి పోతున్న పాత పంటలు, చిరు ధాన్యాల్లో పోషక విలువలు, వాటి ఉపయోగాలపై సంస్థ డైరెక్టర్ నిమ్మయ్య వివరించారు. ప్రస్తుతం వ్యవసాయం మందులతో కలుషితమైందని, సేంద్రియ సాగు విధానాలు అవలంబించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కొక్కలకొండ అరుణ, క్రాంతి కుమార్, లక్ష్మణ్, మిని ప్రాజెక్టు కో ఆర్డినేటర్ మహేష్ పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు ప్రత్యేక శిబిరాలు

- అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

సాక్షి,యాదాద్రి : ఓటరు నమోదు కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) భాస్కర్‌రావు కోరారు. భువనగిరిలోని గంజి హైస్కూల్, విద్యుత్ శాఖ ఏడీఈ కార్యాయాల్లో ఓటరు నమోదు శిబిరాలు, ఓటరు జాబితాలను పరిశీలించారు. ఓటరు నమోదు, చేర్పులు, మార్పులకు సంబంధించి వివరాలపై బీఎల్‌ఓలను అడిగి తెలుసుకున్నారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటరు నమోదుకోసం ఈ నెల 26, 27, సెప్టెంబర్ 2,3 తేదీల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 2023 అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండి ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఫారం–6, సవరణలు, మార్పులు, చేర్పులకు ఫారం–8, తొలగింపునకు ఫారం–7 అందుబాటులో ఉంటాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు కీలకమని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. ఆయన వెంట ఆర్ఐ హరికిషన్ ఉన్నారు.

ఆర్యవైశ్యులకు ఆరు సీట్లు కేటాయించాలి

- ఆర్య వైశ్య వికాస వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కాశం సత్యనారాయణ

హాలియా : రాష్ట్రంలో త్వరలో రానున్న ఎన్నికల్లో ఆర్యవైశ్యులకు అన్నీ రాజకీయ పార్టీలు ఆరు ఎమ్మెల్యే స్థానాలు కేటాయించాలని ఆర్యవైశ్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కాశం సత్యనారాయణ గుప్త కోరారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని చైతన్య ఫంక్షన్ హాల్‌లో ఆర్య వైశ్యుల ఆత్మగౌరవ సభ జరిగింది. ముందుగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించిన నాయకులు అనంతరం సభ వద్దకు చేరుకున్నారు. ఈ కార్యక్రమానికి ఆర్యవైశ్య వికాస వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ గుప్త ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్యవైశ్యులకు అన్ని రాజకీయ పార్టీలు అన్యాయం చేస్తున్నాయన్నారు. ఆర్యవైశ్యులను అన్నీ రాజకీయ పార్టీలు ఓట్లుగా వాడుకుటుంటున్నారని, జనాభా దామాషా ప్రకారం అన్నీ రాజకీయ పార్టీలు ఆర్యవైశ్యులకు 6 సీట్లు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆర్యవైశ్యులు ఐక్యంగా ఉండి హక్కుల సాధన కోసం పోరాడాలని పిలుపు నిచ్చారు. ఆర్యవైశ్య సంక్షేమ కోసం వైశ్య కమీషన్ ఏర్పాటు చేయాలని, ఈడబ్ల్యూ వర్గీకరణ చేయాలని, విదేశీ విద్య సహాయ నిధి ఏర్పాటు చేసి వైశ్య బంధును ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అక్టోబర్ 1న హైదరాబాద్‌లో జరిగే వైశ్య గర్జనకు పెద్ద ఎత్తున ఆర్యవైశ్యులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు మిట్టపల్లి వాసులు, మండల అధ్యక్షుడు వీరమళ్ళ కృష్ణయ్య, చీదళ్ళ లింగయ్య, తేలప్రోలు శేఖర్, వెంపటి శ్రీనివాస్, పాంపాటి శ్రీనివాస్, గుండా కృష్ణమూర్తి, రేపాల వెంకన్న, కొత్తమాసు శ్రీను, బచ్చు వెంకన్న, బచ్చు సతీష్, గణేష్, పాంపాటి పాండరయ్య ఉన్నారు.

బస్సును ఢీకొట్టిన లారీ.. ఎనిమిది మందికి గాయాలు

నూతనకల్ : బస్సును వెనుక నుంచి లారీ కొట్టడంతో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. ఈ ఘటన నూతన్‌కల్ మండల పరిధిలోని బిక్కుమళ్లలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం...సూర్యాపేట డిపోకు చెందిన పల్లె వెలుగు బస్సు మహబూబ్‌బాద్ నుంచి సూర్యాపేటకు వస్తూ బిక్కుమళ్ల గ్రామంలోని 365 జాతీయ రహదారిపై బస్సును వెనక నుండి ఢీకొట్టింది. ఆ సమయంలో బస్సులో మొత్తం 35మంది ప్రయానికులు ఉండగా ఎనిమిది మందికి గాయాలయ్యాయి. గాయాలపాలైన వారిని అధికారులు సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఇరు వర్గాల మధ్య ఘర్షణ

నూతనకల్ : ఇరు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో పలువురికి గాయాలయయ్యాయి. ఈ ఘటన నూతన్‌కల్ మండల పరిధిలోని ఎర్రపహాడ్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...లింగాల అంజయ్య, లింగాల వెంకటయ్య కుటుంబాల మధ్య ఎన్నో సంవత్సరాల నుంచి వివాదాలు ఉన్నాయి. గ్రామంలో జరుగుతున్న ముత్యాలమ్మ పండుగ వేడుకల సందర్భంగా ఇద్దరిమధ్య జరిగిన వాగ్వాదానికి వెంకటయ్య వర్గానికి చెందిన వారు ముత్యాలమ్మ గుడి దగ్గర అంజయ్య కుటుంబ సభ్యులపై దాడి చేశారు. దీంతో ఒకరిపై ఒకరు దాడి చేసుకోగా ఇరువర్గాలకు చెందిన ఎనిమిది మందికి తీవ్ర గాయాలు కాగా వారిని చికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.